క్లుప్తంగా

సంగీతంపై విద్యార్థులకు అవగాహన



అవగాహన కల్పిస్తున్న గ్రంథాలయ అధికారి

చాపాడు : స్థానిక శాఖా గ్రంథాలయంలో మంగళవారం సంగీతంపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. వేసవి విజ్ఞాన శిక్షణ శిబిరం కార్యక్రమంలో భాగంగా 19వ రోజు విద్యార్థులకు గ్రంథాలయ అధికారి జే.శివశంకర్‌రెడ్డి ఆధ్వర్యంలో సంగీతంపై అవాహన కల్పించారు. సామవేదం నుంచి సంగీతం వచ్చిందని ఇందులో రెండు రకాలు ఉంటాయని భారతీయ సంగీతం, పాశ్చాత్య సంగీతం ఉంటాయన్నారు. భారతీయ సంగీతాన్ని ఇంగ్లీషులో ఇండియన్ మ్యూజిక్ అని, తెలుగులో రాగసంప్రదాయ పద్ధతి అని అంటారన్నారు. దేశంలో వివిధ ప్రాంతాలలో వివిధ రకాలుగా సంగీతం ఉత్పన్నం అయిందని దీనిని శ్రద్ధతో నేర్చుకుంటే ఇందులో ప్రావీణ్యం సాధిస్తామన్నారు.

కార్మికుల సమస్యలను పరిష్కరించాలి



ఏఐటీయూసీ నాయకుల నిరసన

ప్రొద్దుటూరు : స్థానిక గాంధీ రోడ్డులోని గాంధీ విగ్రహం వద్ద మంగళవారం ఏఐటీయూసీ ఆధ్వర్యంలో కార్మికుల సమస్యలను పరిష్కరించాలని నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి పి.సుబ్బరాయుడు మాట్లాడుతూ దేశవ్యాప్తంగా మంగళవారం జరగాల్సిన సమ్మెను యుద్ధంపై వస్తున్న వార్తల మూలంగా జాతీయ కార్మిక సంఘాలు సమ్మెను జూలై 9కి వాయిదా వేశాయన్నారు. కార్మికులకు కనీస వేతనం రూ.26వేలు ఇవ్వాలని, నిత్యావసర సరుకుల ధరలను నియంత్రించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ పట్టణ అధ్యక్షుడు వై.హరి, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ కార్యదర్శి మధు, ఆటో యూనియన్ సహాయ కార్యదర్శి నరసింహ, హమాలీ వర్కర్స్ యూనియన్ కార్యదర్శి గురవయ్య తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా గ్రామోత్సవం



గ్రామంలో ఊరేగుతున్న మూలమూర్తి

కలసపాడు : మండల కేంద్రమైన కలసపాడులో శ్రీ అభయాంజనేయస్వామి నూతన విగ్రహ ప్రతిష్ఠ, శిఖర కలశ ప్రతిష్ఠ, కుంభాభిషేక మహోత్సవాల్లో భాగంగా మంగళవారం పురోహితులు వారణాసి వెంకటరమణ వరప్రసాద్ బ్రహ్మత్వమున అన్నదానం శివబాలకుమార్‌శర్మ ఆచారత్వమున స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అలానే హోమాలు, అభిషేకాలు జరిపి, గ్రామ పురవీధుల్లో స్వామివారిని ఊరేగించారు.

అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించాలి



తహసీల్దారుకు వినతిపత్రం అందజేస్తున్న అంగన్‌వాడీ టీచర్లు

కలసపాడు : అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించాలని సీఐటీయూ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు మంగళవారం తహసీల్దారు మధురవాణికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వ్యవసాయ కార్మిక సంఘం గౌరవ అధ్యక్షుడు గురయ్య మాట్లాడుతూ అంగన్‌వాడీలను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని, గ్రాట్యుటీ అమలు చేయాలని, కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని, పెన్షన్, పీఎఫ్, ఈఎస్ఐ అమలు చేయాలని కోరారు. మినీ వర్కర్స్‌ను మెయిన్ వర్కర్స్‌గా గుర్తించాలని, అంగన్‌వాడీ టీచర్లకు సంక్షేమ పథకాలు అమలు చేయాలని, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు బడ్జెట్ పెంచాలని కోరారు.

త్రైత సిద్ధాంత భగవద్గీతతోనే జ్ఞానం



ప్రచారంలో ప్రబోధ సేవాసమితి సభ్యులు

పోరుమామిళ్ల : త్రైత సిద్ధాంత భగవద్గీత గ్రంథం శ్రీ కృష్ణుడి అసలైన జ్ఞానం తెలుపుతుందని ఇందూ జ్ఞానవేదిక ప్రబోధ సేవా సమితి అధ్యక్షుడు శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు. మంగళవారం త్రైత సిద్ధాంత భగవద్గీత, అనుబంధ సిద్ధాంత జ్ఞాన గ్రంథాల ప్రచారం పుల్లీవీడు, చెన్నారెడ్డిపేట, పోరుమామిళ్ల పట్టణంలో నిర్వహించారు.

గుక్కెడు నీళ్లివ్వండి మహాప్రభో

- 20 రోజులుగా వేధిస్తున్న తాగునీటి సమస్య
- పట్టించుకోని మున్సిపల్ అధికారులు
- తీవ్ర ఇబ్బందులు పడుతున్న తొట్టిగారిపల్లె బీసీ కాలనీ వాసులు

బద్వేలు అర్బన్ : మున్సిపాలిటీ పరిధి 28వ వార్డులోని తొట్టిగారిపల్లె బీసీ కాలనీ వాసులు గత 20 రోజులుగా తాగునీటి కోసం తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గుక్కెడు నీళ్లివ్వండి మహాప్రభో అంటూ మున్సిపల్ అధికారులను వేడుకుంటున్నా పట్టించుకునేవారే కరువయ్యారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. బద్వేలు – మైదుకూరు రహదారిలోని తొట్టిగారిపల్లె వద్ద నేషనల్ హైవే రోడ్డు విస్తరణ పనుల్లో భాగంగా తాగునీటిని అందించే పైపులైను డ్యామేజీ కావడంతో తాగునీటి సమస్య ఏర్పడినట్లు తెలుస్తోంది.



తాగునీటి కోసం ఖాళీ బిందెలతో ఎదురుచూస్తున్న మహిళలు

20 రోజులుగా తాగునీటి సమస్య

తొట్టిగారిపల్లె బీసీ కాలనీలో దాదాపు 70 కుటుంబాలు నివసిస్తుండగా సుమారు 420 పైచిలుకు జనాభా ఉన్నారు. వీరందరూ మున్సిపాలిటీ ద్వారా అందించే తాగునీటి పథకం నీటిని వాడుకుంటున్నారు. దాదాపు 60 కుళాయి కనెక్షన్లు ఉన్నాయి. అయితే గత 20 రోజుల క్రితం జాతీయ రహదారి రోడ్డు విస్తరణ పనులు చేపట్టే క్రమంలో కాలనీకి తాగునీటిని అందించే పైపులైను ధ్వంసం చేశారు. అప్పటి నుంచి నీటి సమస్య ఉత్పన్నమైంది. మున్సిపల్ సిబ్బందికి అనేకమార్లు తెలిపినా పట్టించుకునేవారే కరువయ్యారని కాలనీవాసులు వాపోతున్నారు. దీంతో చేసేది లేక చుట్టుపక్కల ఇళ్లల్లో ఉన్న బోర్ల వద్ద నీటిని తెచ్చుకుని కాలం వెల్లదీస్తున్నారు. కొంత మంది బోర్ల వద్ద తెచ్చుకున్న నీటిని ప్లాస్టిక్ డ్రమ్ముల్లో భద్రపరుచుకుని వాడుకుంటున్నారు. అంతేకాకుండా కాలనీకి వెళ్లే రహదారి సైతం ధ్వంసం చేయడంతో కాలనీవాసులు ఇబ్బందులు పడుతున్నారు.



రోడ్డు విస్తరణ పనుల్లో డ్యామేజీ అయిన పైపులైను

తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం



కాలనీలో గత 20 రోజులుగా నీరు రాకపోవడంతో నీళ్ల కోసం తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం. కూలి పనులకు వెళ్లి జీవనం సాగించే మేము డబ్బులు పెట్టి నీళ్లు కొనుగోలు చేయాలంటే సాధ్యమయ్యే పనేనా. అధికారులు తక్షణమే స్పందించి తాగునీటి సమస్యను పరిష్కరించాలి. – పి.సుబ్బమ్మ, తొట్టిగారిపల్లె బీసీకాలనీ

పట్టించుకునేవారే కరువయ్యారు



తొట్టిగారిపల్లె బీసీ కాలనీలో గత 20 రోజులుగా తాగునీటి సమస్య వేధిస్తున్నా పట్టించుకునే అధికారే కరువయ్యారు. కనీసం ట్యాంకర్ల ద్వారానైనా నీటి సరఫరా చేసి ఆదుకోవాలి కదా. ఇప్పటికైనా అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలి. – పి.బాలపోలమ్మ, తొట్టిగారిపల్లె బీసీకాలనీ

త్వరితగతిన పరిష్కరిస్తాం

తొట్టిగారిపల్లె బీసీ కాలనీలో 20 రోజులుగా ఉన్న తాగునీటి సమస్యపై మున్సిపల్ ఏఈని వివరణ కోరగా రోడ్డు విస్తరణ పనుల్లో పైపులు డ్యామేజీ కావడంతో తాగునీటి సమస్య ఏర్పడింది. ఇప్పటికే ఈ విషయాన్ని సంబంధిత నేషనల్ హైవే కాంట్రాక్టు సిబ్బంది దృష్టికి తీసుకుపోయాం. వీలైనంత త్వరగా సమస్యను పరిష్కరిస్తాం. – మహేష్, మున్సిపల్ ఏఈ, బద్వేలు

కార్మిక చట్టాలను పాత పద్ధతిలోనే కొనసాగించాలి



నిరసన ర్యాలీలో సీఐటీయూ నాయకులు



పోరుమామిళ్ల: ధర్నా చేస్తున్న సీఐటీయూ శ్రేణులు

ప్రొద్దుటూరు రూరల్ : కార్మిక చట్టాలను పాత పద్ధతిలోనే కొనసాగించాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి సత్యనారాయణ డిమాండ్ చేశారు. మంగళవారం పాత బస్టాండ్ నుంచి శివాలయం సర్కిల్ వరకు సీఐటీయూ ఆధ్వర్యంలో కార్మికులతో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 8 గంటల పని రద్దు చేసి 12 గంటలకు పెంచాలనే ఆలోచనలో బీజేపీ ప్రభుత్వం ఉందని, దీనిని కార్మికులు తిప్పికొట్టేందుకు సిద్ధంగా ఉన్నారు. ప్రభుత్వ సంస్థలతో ముడిపడి పనిచేస్తున్న ప్రతి కార్మికుడికి రూ.26వేలు వేతనం ఇవ్వడంతోపాటు ఉద్యోగ భద్రత కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ కార్యదర్శి విజయకుమార్, బాబు, పక్కీరయ్య, శేఖర్, మున్సిపల్ యూనియన్ కార్యదర్శి సాల్మన్, కోశాధికారి రాఘవ, ప్రమీలమ్మ, రమణమ్మ, అంగన్‌వాడీ యూనియన్ కార్యదర్శి సుబ్బలక్ష్మి, సునీత, గీత, మెడికల్ రెప్స్ యూనియన్ నాయకుడు నరసింహారెడ్డి, పశువైద్య కళాశాల యూనియన్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

పోరుమామిళ్ల : కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న కార్మిక, కర్షక వ్యతిరేక విధానాలను నిరసిస్తూ మంగళవారం సీఐటీయూ ఆధ్వర్యంలో స్థానిక అంబేడ్కర్ విగ్రహం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ సంస్థ జిల్లా ఉపాధ్యక్షుడు భైరవప్రసాద్ మాట్లాడుతూ లేబర్ కోడ్ నల్ల చట్టాలు రద్దు చేయాలని, కార్మికులకు కనీస వేతనం రూ. 26 వేలు ఇవ్వాలని, ప్రభుత్వ సంస్థల ప్రైవేటీకరణ విరమించాలని, కార్మికులకు గుర్తింపు కార్డులు ఇవ్వాలని, కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ పద్ధతి రద్దు చేయాలని డిమాండ్ చేశారు.

నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలి

బద్వేలు అర్బన్ : కార్మికుల హక్కులను హరించే నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి కె.నాగేంద్రబాబు పేర్కొన్నారు. జాతీయ కార్మిక సంఘాల పిలుపు మేరకు దేశవ్యాప్త ఆందోళనలో భాగంగా మంగళవారం స్థానిక ఆర్డీఓ కార్యాలయం ఎదుట సీఐటీయూ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్మికులు ఎన్నో ఏళ్లు పోరాడి సాధించుకున్న చట్టాలను బీజేపీ ప్రభుత్వం నిర్వీర్యం చేస్తోందని, కార్మిక వర్గాన్ని యాజమాన్యాలకు బానిసలుగా మార్చేందుకు నాలుగు లేబర్ కోడ్‌లను తెచ్చిందన్నారు. అంతేకాకుండా ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణ విధానాలను విరమించుకోవాలని కోరారు. కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులను రెగ్యులర్ చేయడంతో పాటు కనీస వేతనం రూ.26 వేలు చెల్లించాలని కోరారు. అలాగే ఆప్కాస్ సంస్థను ప్రైవేటు ఏజెన్సీలకు అప్పగించే చర్యలను విరమించుకోవాలని చెప్పారు. ఇప్పటికైనా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్మికుల సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని, లేనిపక్షంలో జూలై 9న దేశవ్యాప్త సార్వత్రిక సమ్మె నిర్వహిస్తామని హెచ్చరించారు. అనంతరం ఆర్డీఓ చంద్రమోహన్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సీఐటీయూ పట్టణ నాయకులు నాగార్జున, సుబ్బరాయుడు, శివకుమార్, హరి, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నాయకులు శ్రీనివాసులు, సత్యరాజ్, దేవమ్మ, నారాయణ, రామయ్య తదితరులు పాల్గొన్నారు.



ఆర్డీఓ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహిస్తున్న సీఐటీయూ నాయకులు

కుందూ–పెన్నా వరద కాలువ నిర్మించాలి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే వరదరాజులరెడ్డి

ప్రొద్దుటూరు : ప్రొద్దుటూరు నియోజకవర్గానికి సంబంధించి టీడీపీ మినీ మహానాడు కార్యక్రమాన్ని ఎర్రగుంట్ల బైపాస్ రోడ్డులో మంగళవారం నిర్వహించింది. మొత్తం 12 తీర్మానాలను ఆమోదించి ప్రభుత్వానికి పంపుతున్నట్లు ఎమ్మెల్యే వరదరాజులరెడ్డి తెలిపారు. ఆగిపోయిన కుందూ–పెన్నా వరద కాలువను నిర్మించాలని మాజీ ఎంపీపీ నంద్యాల రాఘవరెడ్డి ప్రతిపాదించిన తీర్మానాన్ని ఆమోదించారు. చేనేత కార్మికులకు అపెరెల్ పార్కు ఏర్పాటు చేయాలని, మహిళల సాధికారతకు కృషి చేయాలన్నారు. కార్మిక భవనం నిర్మించాలని, ప్రొద్దుటూరు పట్టణానికి నాలుగు వైపులా ఉన్న కొర్రపాడు రోడ్డు, మైదుకూరు రోడ్డుతోపాటు హోమస్‌పేట, శ్రీరాములపేట వీధి, గంగమ్మ దేవాలయం వీధి, సుందరాచార్యుల వీధిని విస్తరించాలని తీర్మానించారు. చేనేత కార్మికుల జీవనోపాధి కోసం క్లస్టర్‌ను ఏర్పాటు చేయాలని, వైద్య కళాశాలను నిర్మించాలని తెలిపారు. స్పోర్ట్స్ కాంప్లెక్స్‌ను నిర్మించి క్రీడలను ప్రోత్సహిస్తామని, స్వర్ణ కార్మికుల కోసం క్లస్టర్‌ను ఏర్పాటు చేయాలని, డ్రైనేజీ వ్యవస్థను మెరుగుపరచాల్సిన అవసరం ఉందన్నారు. నూతన కూరగాయల మార్కెట్ నిర్మాణాన్ని పూర్తి చేయాలని, జమ్మలమడుగులో ఉక్కు పరిశ్రమను నిర్మించాలని తీర్మానించారు. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు మినీ మహానాడు కార్యక్రమం జరిగింది. కార్యక్రమంలో టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యుడు శ్రీనివాసరెడ్డి, స్థానిక నేతలు సీఎం సురేష్ నాయుడు, ఈవీ సుధాకర్‌రెడ్డి, నంద్యాల కొండారెడ్డి, వీఎస్ ముక్తియార్, బసిరెడ్డి రాజేశ్వర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్సీ బచ్చల పుల్లయ్య, మాజీ మున్సిపల్ చైర్మన్ ఆసం రఘురామిరెడ్డి, కుతుబుద్దీన్, వద్ది బాలుడు తదితరులు పాల్గొన్నారు.

అధికార పార్టీ అండతో దళితులపై దాడులు

ప్రొద్దుటూరు : అధికార పార్టీ నాయకుల అండతో రాష్ట్రంలో దళితులపై దాడులు జరుగుతున్నాయని ఏపీ దళిత సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు కొత్తపల్లె యల్లయ్య మాదిగ తెలిపారు. స్థానిక మైదుకూరు రోడ్డులోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహం వద్ద మంగళవారం ఏపీ దళిత సమాఖ్య ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తిరుపతి ఇంజనీరింగ్ కాలేజీలో నెల్లూరు జిల్లాకు చెందిన జేమ్స్ బీటెక్ చదువుతున్నాడన్నారు. జేమ్స్‌ను అగ్రవర్ణ విద్యార్థులు అవమానాలు చేసి హింసించారన్నారు. తనను హింసించిన గోపి, నాని, యశ్వంత్ నాయుడు తదితరులపై జేమ్స్ పోలీసులకు ఫిర్యాదు చేశాడన్నారు. పోలీసులు వారికి నచ్చే విధంగా మరో ఫిర్యాదును రాయించుకుని కేసును నీరుగార్చే ప్రయత్నం చేస్తున్నారన్నారు. ఎస్సీ, ఎస్టీ ఫిర్యాదులను నిర్లక్ష్యం చేసినా, తారుమారు చేసిన పోలీసులు కూడా నిందితులు అవుతారని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఆర్ఎంఎస్ కన్వీనర్ లక్ష్మీదేవి, ఏపీ దళిత సమాఖ్య జిల్లా అధ్యక్షుడు బి.జయన్న, బొడ్డు బాలకుమార్, మహాజన రాష్ట్ర సమితి అధ్యక్షుడు వై.చంద్రశేఖర్, హ్యూమన్ రైట్స్ ప్రొటెక్షన్ రాష్ట్ర నాయకుడు వెంకటన్న, బహుజన సమాఖ్య ప్రొద్దుటూరు నాయకుడు దొరస్వామి నాయక్, రఘుపతి నాయక్, జయరాం నాయక్, చిన్నయ్య, ఎమ్మార్పీఎస్ నాయకుడు గడ్డం నరసింహులు మాదిగ, రాయలసీమ పరిరక్షణ సమితి నాయకుడు ఎం.ప్రతాప్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న ప్రజా సంఘాల నాయకులు

రేపు హనుమాన్ శోభాయాత్ర



మాట్లాడుతున్న దశమందం బాబు

ప్రొద్దుటూరు కల్చరల్ : హనుమత్ జయంతి సందర్భంగా హనుమాన్ శోభాయాత్ర నిర్వహించనున్నట్లు జై శ్రీరామ భక్త బృందం వ్యవస్థాపకుడు దశమందం బాబు తెలిపారు. స్థానిక ప్రెస్‌క్లబ్‌లో మంగళవారం ఆయన మాట్లాడుతూ హనుమాన్ జయంతి సందర్భంగా జై శ్రీరామ భక్త బృందం, దశమందం బ్రదర్స్ ఆధ్వర్యంలో నిర్వహించే శోభాయాత్ర గురువారం ఉదయం 8 గంటలకు పాత మార్కెట్‌లోని ఆంజనేయస్వామి ఆలయం నుంచి ప్రారంభమవుతుందన్నారు. దర్గా బజార్, సుందరాచార్యుల వీధి, గాంధీ రోడ్డు, బొల్లవరం ఆంజనేయస్వామి ఆలయం, టీబీ రోడ్డు, శివాలయం సెంటర్, మైదుకూరు రోడ్డులోని రిలయన్స్ పెట్రోలు బంకు, టూటౌన్ పోలీస్‌స్టేషన్ సమీపంలో అభయాంజనేయస్వామి ఆలయం వరకు శోభాయాత్ర కొనసాగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో హిందువులు, కుల సంఘాలు, స్వచ్ఛంద సంస్థల, ఆలయాల నిర్వాహకులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ యాత్రలో పాల్గొనే మొదటి 500 మందికి ఆంజనేయ స్వామి చిత్రం ఉన్న కాషాయ జెండాను అందిస్తామన్నారు. ఈ సమావేశంలో జై శ్రీరామ భక్త బృందం నిర్వాహకుడు దశమందం రాజశేఖర్, గో సంరక్షణ సమితి అధ్యక్షుడు శివనాగిరెడ్డి, వెంకటేష్ పాల్గొన్నారు.

రేపు హనుమత్ జయంతి

బద్వేలు : బద్వేలు మున్సిపాలిటీ పరిధిలోని అనంతగిరి క్షేత్రంపై వెలసిన శ్రీ అభయాంజనేయ స్వామి జయంతి ఉత్సవాలు ఘనంగా జరుగనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. గురువారం తెల్లవారుజామున 4:30 గంటలకు స్వామి వారికి సుప్రభాత సేవ, 5 గంటలకు స్వస్తివాచనం, గణపతి పూజ, కలశస్థాపన, మూలవిరాట్‌నకు పంచామృతాభిషేకం, ఉత్సవమూర్తులకు మంగళ స్నానములు, అలంకరణ, సింధూర కుంకుమ, పుష్పార్చన, ఆకు పూజ, నైవేద్య సమర్పణలు ఉంటాయన్నారు. అనంతరం స్వామివారికి హోమం, మంగళహారతి, తీర్థప్రసాద వినియోగంతోపాటు మధ్యాహ్నం అన్నదాన కార్యక్రమం ఉంటుందని తెలియజేశారు.

తెలుగు మాధ్యమాన్ని కొనసాగించాలి



మాట్లాడుతున్న రవిశంకర్

గోపవరం : ప్రభుత్వ పాఠశాలల్లో ఆంగ్ల మాధ్యమంతో పాటు తెలుగు మాధ్యమాన్ని సమాంతరంగా కొనసాగించడంతో పాటు పిల్లలకు ప్రైమరీ స్థాయి నుంచి పదవ తరగతి వరకు మాతృభాష అయిన తెలుగు మాధ్యమాన్ని ప్రభుత్వ పాఠశాలల్లో ప్రవేశపెట్టడం ఎంతైనా అవసరం ఉందని డెమోక్రటిక్ పీఆర్టీయూ జిల్లా అధ్యక్షుడు మానుగుంట రవిశంకర్ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఏ విద్యార్థి అయినా విషయ పరిజ్ఞానాన్ని మాతృభాష ద్వారానే సంపూర్ణంగా గ్రహించగలుగుతాడని, రాష్ట్రంలో తెలుగు మాధ్యమం లేకుండా విద్యార్థులకు కేవలం ఇంగ్లిష్ మాధ్యమంలోనే బోధించడం ఎంత వరకు సమంజసమని ఆయన ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. రాష్ట్రంలోని పాఠశాలల్లో ఉర్దూ, తమిళం, కన్నడం, ఒరియా లాంటి ఇతర మాధ్యమాలను కొనసాగిస్తున్నప్పుడు మన మాతృభాషను పాఠశాలల్లో కొనసాగించకపోవడం విచారకరమన్నారు. మోడల్, ప్రైమరీ పాఠశాలల్లో స్కూల్ అసిస్టెంట్ల నియామకం సరికాదని, వారిని ఉపాధ్యాయ, విద్యార్థి నిష్పత్తి తగ్గించి ఉన్నత పాఠశాలలు, ప్రాథమికోన్నత పాఠశాలల్లో సర్దుబాటు చేయాలని కోరారు. అర్హులైన సెకండరీ గ్రేడ్ ఉపాధ్యాయులకు ప్రమోషన్లు ఇచ్చి మోడల్, ప్రైమరీ పాఠశాలల్లో ప్రధానోపాధ్యాయులుగా నియమించాలని కోరారు.

రేపు విశ్వనాథపురంలో వీరాంజనేయస్వామి తిరునాల

చాపాడు : మండల పరిధిలోని విశ్వనాథపురంలో ప్రసిద్ధి చెందిన శ్రీ వీరాంజనేయస్వామి దేవాలయ సన్నిధిలో ఈ నెల 22, 23వ తేదీలలో శ్రీవీరాంజనేయస్వామి(33వ) జయంతోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించనున్నారు. గురువారం ఉదయం వీరాంజనేయస్వామి సన్నిధిలో ఉదయం 5గంటల నుంచి సుప్రభాత సేవతో మొదలై శుక్రవారం రాత్రి వరకూ పంచామృతాభిషేకంలు, అలంకారం, సహస్రనామార్చన, హనుమాన్ జపము, గణపతి పూజ, పుణ్యావాహచనం, పంచకవ్యప్రోక్షణ మన్య సూక్తపారాయణ, గణపతి హోమం మహామంగళహారతి, తీర్థ ప్రసాదములు వినియోగం జరుతుందన్నారు. రెండు రోజుల పాటు భక్తులకు ఆలయం వద్ద అన్నదాన కార్యక్రమం నిర్వహించనున్నారు.

23న ఒల్లు కేటగిరి ఎద్లకు బంగలాగుడు పోటీలు

వీరాంజనేయస్వామి జయంతోత్సవ వేడుకలను పురస్కరించుకుని శుక్రవారం మధ్యాహ్నం 3 నుంచి ఒల్లు కేటగిరి ఎద్లకు బండలాగుడు పోటీలు నిర్వహించనున్నారు. ఈ పోటీలలో గెలుపొందిన ఎద్దుల ఎజమానులకు రూ.70వేలు, రూ.50వేలు, రూ.40వేలు, రూ.30వేలు, రూ.20వేలు, రూ.10వేలు, రూ.5వేల చొప్పున నగదు అందజేయనున్నట్లు నిర్వాహకులు తెలియజేశారు.



వీరాంజనేయస్వామి దేవాలయం

జాంబవ భవన నిర్మాణానికి సహకరించండి

బద్వేలు అర్బన్ : హైదరాబాద్‌లో నిర్మించనున్న జాంబవ భవన నిర్మాణానికి మాదిగ ఉద్యోగస్తులందరూ సహకరించాలని మాదిగ ఉద్యోగుల సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు దేవరపల్లి భిక్షాలు పిలుపునిచ్చారు. మంగళవారం స్థానిక విశ్రాంత ఉద్యోగుల సంఘం సభా భవనంలో నిర్వహించిన బద్వేలు తాలూకా మాదిగ ఉద్యోగుల సమాఖ్య ఆత్మీయ సమావేశంలో ఆయన మాట్లాడారు. మాదిగ ఉద్యోగస్తులందరూ తమ సభ్యత్వాలను నమోదు చేసుకోవాలని పిలుపునిచ్చారు. సమావేశంలో మాదిగ ఉద్యోగుల సమాఖ్య జిల్లా అధ్యక్షుడు పిచికె బాబు, తాలూకా అధ్యక్షుడు యర్రబల్లె ఓబయ్య, రాష్ట్ర నాయకుడు దేవానందం, శోభన్, గురయ్య, మాజీ ఎస్సీ కార్పొరేషన్ ఈడీ హెచ్.వెంకటసుబ్బయ్య, తాలూకా నాయకులు ప్రసాద్, జయచంద్రబాబు, పిచ్చయ్య, ఓ.ఎస్.వి.ప్రసాద్, సుమన్, బాలఓబయ్య, సుందరయ్య, వీరయ్య, గ్రేసెస్, శివయ్య తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న దేవరపల్లి భిక్షాలు

మినీ మహానాడుకు ప్రవీణ్, లింగారెడ్డి వర్గీయుల డుమ్మా

ప్రొద్దుటూరు : ప్రొద్దుటూరు నియోజకవర్గానికి సంబంధించి మంగళవారం నిర్వహించిన టీడీపీ మినీ మహానాడు కార్యక్రమానికి పార్టీ నియోజకవర్గ మాజీ ఇన్‌చార్జి జీవీ ప్రవీణ్‌కుమార్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే మల్లేల లింగారెడ్డితోపాటు వారి వర్గీయులు గైర్హాజరయ్యారు. గడిచిన ఎన్నికల నాటి నుంచి ఈ నేతల మధ్య సఖ్యత లేదు. పార్టీ కార్యక్రమాలకు కలిసి హాజరు కావడం లేదు. అదే రీతిలో ప్రస్తుతం మినీ మహానాడు కార్యక్రమానికి వీరు హాజరు కాకపోవడం గమనార్హం. ఈ నెలాఖరులో కడపలో జరిగే రాష్ట్రస్థాయి టీడీపీ మహానాడు కార్యక్రమంలో లింగారెడ్డి, ప్రవీణ్‌కుమార్‌రెడ్డిలకు ప్రాతినిధ్యం కల్పించారు. ఎమ్మెల్యే నంద్యాల వరదరాజులరెడ్డిని మహానాడుకు సంబంధించిన వసతి ఏర్పాట్ల కమిటీలో సభ్యునిగా, రవాణా కమిటీకి సంబంధించి మల్లెల లింగారెడ్డిని కమిటీ సభ్యునిగా, జీవీ ప్రవీణ్‌కుమార్‌రెడ్డిని వాహన పార్కింగ్ కమిటీ సభ్యునిగా నియమించారు. ప్రొద్దుటూరులో మాత్రం వీరికి ప్రాధాన్యత కల్పించలేదు.

దరఖాస్తుల ఆహ్వానం

ప్రొద్దుటూరు కల్చరల్ : తపాలా శాఖలో భాగమైన గ్రామీణ తపాలా జీవిత బీమా డైరెక్ట్ ఏజెంట్లుగా ప్రొద్దుటూరు డివిజన్‌లో పనిచేసేందుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు సూపరింటెండెంట్ జి.కిరణ్ ఒక ప్రకటనలో తెలిపారు. స్థానిక మున్సిపల్ కార్యాలయం వద్ద ఉన్న ప్రధాన తపాలా కార్యాలయలో ఈనెల 29, 30వ తేదీలలో ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు వాక్ ఇన్ ఇంటర్వ్యూలు ఉంటాయని ఆయన పేర్కొన్నారు. ఆసక్తిగల అభ్యర్థులు టెన్త్ అర్హత ఉండి, 18 – 50 ఏళ్ల వయసు ఉన్న వారు తమ ఎస్ఎస్‌సీ సర్టిఫికెట్, ఆధార్, పాన్ కార్డు, రెండు ఫొటోలతో ఇంటర్వ్యూలకు హాజరు కావాలని కోరారు. ఎంపికైన ఏజెంట్లు సెక్యూరిటీ డిపాజిట్ రూ.5వేలు చెల్లించాలని, వారికి పాలసీలకు ప్రభుత్వం నిర్ణయించిన కమీషన్ ఇస్తామని తెలిపారు. మరిన్ని వివరాలకు తపాలా జీవిత బీమా, గ్రామీణ తపాలా జీవిత ప్రొద్దుటూరు డివిజన్ డెవలప్‌మెంట్ ఆఫీసర్ వి.సత్యనారాయణ 8498977463 ఫోన్ నంబర్‌కు సంప్రదించాలని సూచించారు.

గంగయ్య సేవలు అమోఘం



గంగయ్యను సన్మానిస్తున్న విద్యార్థులు, జేవీవీ నాయకులు

పోరుమామిళ్ల : స్థానిక గ్రంథాలయంలో గత రెండు వారాలుగా సమ్మర్ క్యాంపులో విద్యార్థులకు స్పోకెన్ ఇంగ్లిష్‌పై శిక్షణ ఇస్తున్న జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత గంగయ్య సేవలు అమోఘమని రాష్ట్రపతి అవార్డు గ్రహీత దాదాపీర్ పేర్కొన్నారు. శిక్షణ ఇచ్చిన గంగయ్యను మంగళవారం లైబ్రేరియన్ ఆఫ్రిది ఆధ్వర్యంలో విద్యార్థులు, జేవీవీ నాయకులు ఖాసిం వలీ, మస్తాన్‌వలీ ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా దాదాపీర్ మాట్లాడుతూ గంగయ్య విద్యార్థులకు చక్కగా శిక్షణ ఇచ్చారన్నారు. విద్యార్థులు అభివృద్ధి చెందాలంటే ఆంగ్లంపై పట్టు అవసరమని జేవీవీ నాయకులు అభిప్రాయపడ్డారు.

చోరీల నియంత్రణకు సహకరించాలి



మాట్లాడుతున్న అర్బన్ సీఐ రాజగోపాల్

బద్వేలు అర్బన్ : చోరీల నియంత్రణకు వ్యాపారస్తులు సహకరించాలని అర్బన్ సీఐ ఎం.రాజగోపాల్ పేర్కొన్నారు. మంగళవారం స్థానిక అర్బన్ స్టేషన్ ఆవరణలో ఆర్టీసీ బస్టాండు పరిసరాలలోని వ్యాపారస్తులకు చోరీల నియంత్రణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చోరీల నియంత్రణకు ప్రతి వ్యాపారస్తుడు తమ దుకాణంలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని సూచించారు. అలాగే అనుమానాస్పద వ్యక్తులు లేదా కొత్త వ్యక్తులు కనిపిస్తే వెంటనే సమాచారం ఇవ్వాలని సూచించారు. ముఖ్యంగా బస్సుల్లో ప్రయాణించే మహిళలు తమ వెంట విలువైన వస్తువులు తీసుకుపోరాదని సూచించారు. ప్రజలు, వ్యాపారస్తులు పోలీసులకు సహకరిస్తే చోరీలను నియంత్రించడం సులభమవుతుందని తెలిపారు. కార్యక్రమంలో అర్బన్ ఎస్ఐ సత్యనారాయణ, సిబ్బంది పాల్గొన్నారు.

నేడు పసుపు, మామిడి వేలం

మైదుకూరు : మండలంలోని వనిపెంట కృషి విజ్ఞాన కేంద్రంలో బుధవారం పసుపు, మామిడి ఫలసాయాలను వేలం వేస్తున్నట్లు కేవీకే అధిపతి, శాస్త్రవేత్త డాక్టర్ ఎం.బాలకృష్ణ ఒక ప్రకటనలో తెలిపారు. బుధవారం ఉదయం 10 గంటలకు నిర్వహించే వేలంలో పాల్గొనే వారు రూ.100 చెల్లించి టోకెన్ తీసుకోవాలని ఆయన సూచించారు. ఆసక్తిగల రైతులు, రైతు ఉత్పత్తిదారుల సంఘాల సభ్యులు వేలంలో పాల్గొనాలని కోరారు. మరిన్ని వివరాలకు డాక్టర్ ఎం.బాలకృష్ణ 9985666503, డాక్టర్ శ్రీవిద్యారాణి 9398982828 నంబర్లకు సంప్రదించాలని తెలిపారు.

రేపు బండలాగుడు పోటీలు

కాశినాయన : ఉప్పలూరు గ్రామంలో శ్రీ అభయాంజనేయస్వామి తిరునాలను పురస్కరించుకుని గురువారం బండలాగుడు పోటీలు నిర్వహించనున్నట్లు ఆలయ నిర్వాహకులు తెలిపారు. మొదటి బహుమతి రూ.లక్ష, రెండవ బహుమతి రూ.70 వేలు, మూడవ బహుమతి రూ.40 వేలు, నాల్గవ బహుమతి రూ.20 వేలను గెలుపొందిన వృషభాలకు అందజేస్తామన్నారు. పోటీలో పాల్గొనే వారు గురువారం మధ్యాహ్నం 2 గంటలలోపు వెయ్యి రూపాయలు చెల్లించి రసీదు పొందాలన్నారు. వివరాలకు 94907 92999ను సంప్రదించాలని కోరారు.